



VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 94 గురువారం 03 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-


## గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

- దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- 4 జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- ఇక ఉత్తరాంధ్రకే వలసలు వస్తాయన్న ముఖ్యమంత్రి
- గోదావరి జలాలు తీసుకొచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు



## వెలుగోడు జలాశయం ముట్టడి పేరుతో వైసీపీ డ్రామాలు

-శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆగ్రహం




నంద్యాల, సెప్టెంబర్ 02 వార్తసాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు జలాశయం ముట్టడి పేరుతో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు నిర్వహించిన సమర శంఖారావం కార్యక్రమం పై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నంద్యాల జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంత్రులు ఎన్.ఎం.డి ఫరూఖ్, బిసి జనార్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్యలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

## వరదల వేళ భారత్ అండ.. నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలేన్ షా ప్రశంసలు

- భారత్, చైనా సాయానికి బాలేన్ షా కృతజ్ఞతలు
- తొలిరోజు నుంచే పరిస్థితిని అంచనా వేశారని వెల్లడి
- మారుమూల ప్రాంతాలకు భారత నిపుణులు చేరుకున్నారని వ్యాఖ్య
- నేపాల్ వరదల్లో 1,127కి చేరిన మృతుల సంఖ్య
- 4,858 మంది ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది



2

## అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయులకు బిగ్ షాక్.. గ్రీన్‌కార్డ్ కోసం 179 ఏళ్లు!

- భారతీయులకు ఈబీ-2 గ్రీన్‌కార్డ్ నిరీక్షణ 179 ఏళ్లు
- ఈబీ-3లో 38 ఏళ్లు, ఈబీ-1లో 5 ఏళ్ల వరకు వేచి చూడొచ్చు
- ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రేషన్ బ్యాక్‌లాగ్ 12 లక్షలు
- ఇందులో దాదాపు 10 లక్షల మంది భారతీయులు
- మొత్తం పెండింగ్‌లో భారతీయుల వాటా 79 శాతం




2

## టీజీఎస్‌ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం ప్రభాకర్




2

- 1000 రోజుల పాలనలో టీజీఎస్‌ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వం
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనం
-సంస్థలోకి 2,932 కొత్త బస్సులు.. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట
- ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే".. కాంగ్రెస్ 1000 రోజుల పాలన పై కేటీఆర్ ఫైర్

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్

కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ



2

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇదే

- ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సాగిందన్న కవిత
- హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారని మండిపాటు
- రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే వస్తుందని వ్యాఖ్య



2

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. బుధవారం పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.

**ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది: సీఎం**

అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు.

**అభివృద్ధికి చిరునామాగా ఉత్తరాంధ్ర**

"గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సభా వేదిక నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం, ప్రాజెక్టు కోసం కృషి చేసిన ఇంజినీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వెలుగోడు జలాశయం ముట్టడి పేరుతో వైసీపీ డ్రామాలు

ఈ సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధి లేకుండా కేవలం రాజకీయ ఉనికిని కాపాడు కోవడానికే వైసీపీ నేతలు ఇలాంటి డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ఎలినోవ ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగానే సాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. ఆరు నెలల ముందుగానే రైతులకు నీరు అందించే పరిస్థితి లేదని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించినప్పటికీ, ఇప్పుడు రైతులను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు రాజకీయ డ్రామాలకు తెరలేపడం దురదృష్టకరమన్నారు. తండ్రి, కొడుకులు చక్రపాణి రెడ్డి, శిల్పా రవికిషోర్ రెడ్డిలు కలిసి మంచి డ్రామాలు ఆడుతున్నారు. రైతుల మేలు కోసం కాదు, కేవలం రాజకీయ ఉనికి కోసం ఈ డ్రామాలు అని ఎమ్మెల్యే బుడ్డా మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీగా వైసీపీ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మాను కోవాలని హితవు పలికారు. వైసీపీ అధికారంలో ఉండగా ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీగా రైతుల ప్రయోజనాల కోసం చేసిన పోరాటాల తేదీలు, సందర్భాలు మరిచారా అని వైసీపీ నేతలను ప్రశ్నించారు. శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతులకు ఎన్ని సార్లు సాగునీరు అందించారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. సాగునీరు ఇస్తానని మాట ఇచ్చి సాగునీరు ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిన శిల్పా చక్రపాణి రెడ్డి శంఖారావాలతో డ్రామాలు చేస్తే సహించేదిలేదన్నారు.సాగునీటి సమస్యల పరిష్కారం కోసం గతంలో కర్నూలుకు వెళ్లి అప్పటి జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసేందుకు




ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకున్న ఘటనలను ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. అప్పట్లో రైతుల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు రైతు ప్రేమికులుగా నటించడం హాస్యాస్పదమన్నారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని, రైతులకు ఏ విధంగా సాగునీరు అందించాలనే అంశంపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం అన్ని కోణాల్లో చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. వైసీపీ నేతల రాజకీయ ఆరోపణలు, ప్రచారాలను రైతులు నమ్మవద్దని కోరిన ఎమ్మెల్యే బుడ్డా. రాజశేఖరరెడ్డి రైతుల సంక్షేమం కోసం ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి నిర్ణయం రైతు ప్రయోజనాల దృష్ట్యానే తీసుకుంటున్నామని వెల్లడించారు

# టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అమలు చేశామని, ప్రస్తుతం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, గతంలో సర్వీసు నుంచి తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరో 1500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, సీసీఎస్, పీఎఫ్ బకాయిలను గణనీయంగా తగ్గించామని మంత్రి వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ విలీన ప్రక్రియను యూనియన్ ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..

# కాంగ్రెస్ 1000 రోజుల పాలన పై కేటీఆర్ ఫైర్

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## వరదల వేళ భారత్ అండ.. నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలేన్ షా ప్రశంసలు

నేపాల్‌లో భారీ వరదలు, కొండచరియల విరిగిపడటంతో తీవ్ర నష్టం జరిగిన వేళ భారత్ అందించిన సకాల సాయంపై ఆ దేశ ప్రధాని బాలేన్ షా ప్రశంసలు కురిపించారు. భారత్, చైనా సకాలంలో సహాయక చర్యలకు మద్దతు ఇచ్చాయని నేపాల్ పార్లమెంట్‌లో తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ సాయం తిరస్కరించే ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేశారు. వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారత్, చైనా తమ సాంకేతిక నిపుణులను పంపాయని బాలేన్ షా చెప్పారు. విపత్తు సంభవించిన తొలిరోజు నుంచే నష్టాన్ని అంచనా వేసేందుకు వైమానిక పరిశీలనతో పాటు ఇతర మార్గాల్లో పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే భారత సాంకేతిక నిపుణులు మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్నారని పేర్కొన్నారు. వరదల ప్రాంతాల్లో బురద, మట్టి భారీగా పేరుకుపోవడంతో సహాయక చర్యలు అత్యంత కష్టంగా మారాయని బాలేన్ షా వివరించారు. ఎక్స్కవేటర్లు మాత్రమే కాదు.. సైన్యం, సాయుధ పోలీసు సిబ్బంది కూడా నిలబడేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నేపాల్‌లోని భోటేకోషి నది ఉప్పొంగడంతో రసువా ప్రాంతాన్ని భారీ వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తుకు వాతావరణ మార్పులే కారణమని బాలేన్ షా ఇటీవల పేర్కొన్నారు. ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రపంచ స్థాయిలో సమన్వయంతో కూడిన విపత్తు నిర్వహణ వ్యవస్థ అవసరమని పిలుపునిచ్చారు. నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య బుధవారం నాటికి 1,127కి చేరింది. వేలాది మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక బృందాలు వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్ భద్రతా బలగాలు 6,541 మందిని ప్రభావిత ప్రాంతాల నుంచి రక్షించాయి. మరో 4,858 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. భారత్ భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. ప్రత్యేక టన్నెల్ రెస్క్యూ బృందాలు, వైద్య బృందాలు, డీఎన్ఏ ఆధారంగా మృతులను గుర్తించే ఫోరెన్సిక్ నిపుణులను నేపాల్‌కు పంపింది. బాధితులను రక్షించేందుకు భారత్ నుంచి ఇప్పటివరకు కనీసం 163 మందిని తరలించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. అత్యవసర సహాయక సామగ్రిలో భాగంగా భారత్ నాలుగు విడతల్లో తాత్కాలిక షెల్టర్లు, దుప్పట్లు, హైజీన్ కిట్లు, సోలార్ లైట్లు, మందులు పంపింది. 70 టన్నులకు పైగా దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, హైజీన్ కిట్లను విమానాల ద్వారా నేపాల్‌కు తరలించింది. బాధితుల సహాయక చర్యల కోసం భారత విదేశాంగ శాఖతో పాటు ఖాట్మండు, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు.

## అమెరికాలో ఉద్యోగం చేస్తున్న భారతీయులకు బిగ్ షాక్.. గ్రీన్‌కార్డ్ కోసం 179 ఏళ్లు!

అమెరికాలో ఉద్యోగం చేస్తూ శాశ్వత నివాసం పొందాలనుకునే భారతీయ నిపుణులకు ఎదురుచూపులు మరింత పెరిగాయి. గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసే కొందరు భారతీయులు 179 ఏళ్ల వరకు వేచి చూడాల్సి రావచ్చని 'నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ' (ఎన్ఎఫ్ఏపీ) తాజా అంచనా వెల్లడించింది. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలో ఇతర దేశాల వారితో పోలిస్తే భారతీయులకే అత్యంత సుదీర్ఘ నిరీక్షణ ఉంటోందని తెలిపింది. డిసెంబరు 2025 నాటికి ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రేషన్ పెండింగ్ దరఖాస్తులు 12 లక్షలు దాటాయి. వీటిలో దాదాపు 10 లక్షల మంది భారతీయులే ఉన్నారు. అంటే మొత్తం పెండింగ్ దరఖాస్తుల్లో భారతీయుల వాటా 79 శాతంగా ఉంది. జనవరి 2026 లేదా ఆ తర్వాత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తు లేదా ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రెంట్ పిటిషన్ దాఖలు చేసిన భారతీయులకు ఈబీ-2 కేటగిరీలో గ్రీన్‌కార్డ్ రావడానికి 179 ఏళ్లు, ఈబీ-3లో 38 ఏళ్లు, ఈబీ-1లో 5 ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఎన్ఎఫ్ఏపీ పేర్కొంది. అమెరికా చట్టాల ప్రకారం ప్రతి ఏడాది ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డులకు సుమారు 1.40 లక్షల పరిమితి ఉంది. ఇందులో ఉద్యోగితో పాటు అతడి కుటుంబ సభ్యులకూ గ్రీన్‌కార్డులు ఉంటాయి. మరోవైపు దేశాల వారీగా కూడా కోటా పరిమితులు ఉన్నాయి. జనాభా భారీగా ఉన్న భారత్ వంటి దేశాలకు చిన్న దేశాలతో సమానంగా పరిమిత సంఖ్యలో గ్రీన్‌కార్డులు లభిస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. చైనాకు చెందిన ఈబీ-2 దరఖాస్తుదారులకు సుమారు 25 ఏళ్ల నిరీక్షణ ఉండొచ్చని ఎన్ఎఫ్ఏపీ అంచనా వేసింది. చైనా ఈబీ-3 దరఖాస్తుదారులకు దాదాపు 7 ఏళ్ల సమయం పడొచ్చని తెలిపింది. భారతీయుల ఈబీ-2 క్యూ ఎలా పెరిగిందో గత గణాంకాలు కూడా చెబుతున్నాయి. 2016లో 47,601 మంది భారతీయుల ఈబీ-2 పిటిషన్లను యూఎస్‌సీఐఎస్ క్లియర్ చేసింది. కుటుంబ సభ్యులతో కలిపి ఇది దాదాపు 98,594 మందికి సమానం. అయితే ఆ ఏడాది కేవలం 4,407 మంది భారతీయులకే ఈబీ-2 శాశ్వత నివాసం లభించింది.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇదే

గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# సంపాదకీయం

## గిరిజనులకు మేలు చేయని 1/70




షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనులు స్వేచ్ఛగా జీవించడానికి, వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆస్తులు, జీవన విధానాన్ని పరిరక్షించడానికి 1/70 చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ ఈ యాభయ్యేళ్లలో అది గిరిజనులకు ఏ మేరకు ఉపయోగపడింది అన్నది ఇంకా ప్రశ్నగానే మిగిలి ఉన్నది. 1970 తర్వాత ఈ చట్టం గిరిజనులకు ఒక్క ఎకరం భూమినైనా పెంచగలిగిందా? అన్న ప్రశ్నకు మనం జవాబు ఆలోచించాలి. 1970 తర్వాత అడవిని కొట్టి కొత్తగా సాగులోకి తెచ్చుకున్న భూమిని పక్కనపెడితే, ఈ అయిదు దశాబ్దాల్లో గిరిజనేతరుల నుంచి చట్టబద్ధమైన క్రయవిక్రయాల ద్వారా గిరిజనులకు కొత్తగా సంక్రమించిన భూమి చాలా తక్కువ. అదే సమయంలో గిరిజనేతరుల మధ్య, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఒప్పందాలు, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున భూలావాదేవీలు జరిగాయన్నది వాస్తవం. ఈ వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమంగా పెద్ద ఎత్తున సంపాదించుకున్నారన్నది బహిరంగ రహస్యం. 1/70 చట్టం ఒకవైపు గిరిజన భూములు గిరిజనేతరులకు వెళ్లకుండా అడ్డుకున్నది నిజమే కానీ, మరోవైపు గిరిజన రైతు తన భూమికి అవసరమైన సమయంలో సరైన విలువ పొందడానికి అడ్డంకిగా మారింది. గిరిజనుల భూమిని రక్షించాల్సిన 1/70 చట్ట సవరణ, అమలులో మాత్రం గిరిజన రైతుల ఆర్థిక స్వేచ్ఛకే పరిమితులు విధించే వ్యవస్థగా మారింది. పక్కనే 1/70 అమలు కాని మండలాల్లో వ్యవసాయ భూమి ఎకరానికి రూ.40--50 లక్షల వరకు విలువ పలికే పరిస్థితులు ఉన్నప్పుడు, 1/70 చట్ట పరిధిలోని ప్రాంతాల్లో అదే స్థాయి భూమి విలువ రూ.10 లక్షల లోపే ఉంది, అదే గిరిజనుల భూమి అయితే అంతకంటే తక్కువే. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి భూమి బదలాయింపుపై ఉన్న చట్టపరమైన ఆంక్షలు. అయితే తక్కువ ధరకు భూమి దొరుకుతుంది కదా అని ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఆర్థికంగా మంచి స్థితికి చేరిన గిరిజనులు సైతం 1/70 ఏరియాలో భూములు కొనడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. భవిష్యత్తులో అవసరం వచ్చినప్పుడు తాము కొనుగోలు చేసిన భూమిని తిరిగి అమ్ముకోలేమనే భయమే దానికి కారణం. ఇది గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛపై తీవ్రమైన చర్చకు దారితీసే అంశం.వ్యవసాయ భూమి రైతుకు కేవలం జీవనాధారం మాత్రమే కాదు. అది కుటుంబానికి ఆధారం. తమ ముందు తరతరాలకు ఆధారం. కష్టకాలంలో ఆర్థిక భద్రత. పిల్లల భవిష్యత్తుకు భరోసా. వ్యాపారం చేయడానికి పెట్టుబడి. అవసరమైనప్పుడు ఆర్థిక అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేయడానికి మూలధనం. అలాంటి పరిస్థితిలో ఒక గిరిజన లేదా గిరిజనేతర రైతు తను సొంతంగా సంపాదించిన లేదా వారసత్వంగా వచ్చిన భూమిని తన అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే లేదా, వారసులకు అందించే విషయంలో ఈ చట్టం గిరిజన/గిరిజనేతరుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుంది, స్వేచ్ఛాయుత క్రయవిక్రయాల నిషేధం ఏ విధంగా న్యాయ సమ్మతం? గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు లేకుండా చేయడం, ఉపాధి అవకాశాలు రాకుండా చేయడం, భూమిని ఆర్థిక ఆస్తిగా వినియోగించుకునే మార్గాలను పూర్తిగా మూసివేయడం ద్వారా గిరిజనులను అభివృద్ధి చేశామని ప్రభుత్వాలు భావిస్తే, దానికంటే శోచనీయమైన విషయం మరొకటి ఉండదు. రక్షణ అంటే అభివృద్ధిని అడ్డుకోవడం కాదు; గిరిజనుడి హక్కును కాపాడుతూ, అతనికి అభివృద్ధి అవకాశాలను కల్పించడం. గిరిజనుల భూమిని కాపాడటమన్న 1/70 చట్టం ఉద్దేశాన్ని ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ 55 సంవత్సరాల తర్వాత మారిన పరిస్థితులకు అనువుగా ఈ చట్టాన్ని సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. ఈ చట్టం గిరిజనుల భూమిని ఎంతవరకు కాపాడింది? గిరిజనుల ఆర్థిక స్థితిని ఎంతవరకు మెరుగుపరిచింది? వారి భూమి విలువను ఎంత పెంచింది? భూ బదలాయింపుపై ఆంక్షల వల్ల గిరిజనులకు జరిగిన మంచీ చెడూ ఏమిటి? ఈ అంశాలన్నిటిపైనా లోతైన సమీక్ష జరగాలి. గిరిజనుల భూమిని రక్షించాలి. అదే సమయంలో గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛను కూడా రక్షించాలి.

# జెన్‌జీని మోదీ జయించగలరా?

నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు. సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో జూన్--జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి 'క్యాబోల్తీ హై పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు. సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకు రాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చన్న అభిప్రాయం కలుగుతోంది.

పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్నదంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు.

రాజకీయ పార్టీల దృక్కోణాల్లోంచి కొత్త తరం దేశాన్ని చూడడం లేదు. కులం, మతం, ప్రాంతం, చివరకు లింగం వంటి సంప్రదాయ గుర్తింపులను కూడా ఈ తరం అధిగమించి ఒక ప్రత్యేక గుర్తింపుతో ముందుకు వచ్చిందనడంలో సందేహం లేదు. చాలా మంది సంప్రదాయ రాజకీయ నాయకులకు వారి ప్రవర్తన, భాష, జీవన శైలి, ఆందోళనలు అర్థం కావడం లేదు. ఆ నవ యువత గురించి తమ సొంత దృక్పథంలో ఆలోచించి, అవే కళ్లద్దాలతో వారిని చూడడం ప్రారంభించారు. వారిని ఆకర్షించేందుకు దయనీయ ప్రయత్నాలు చేస్తున్నారు. తమను తాము హాస్యాస్పదులుగా నిరూపించుకుంటున్నారు. ఈ ప్రయత్నాలు మానేసి నవ తరం లేవనెత్తుతున్న అంశాలను, ఆందోళనలను అర్థం చేసుకోవాల్సి ఉన్నది. విద్య, నిరుద్యోగం, జవాబుదారీ విధానం, వ్యవస్థలు తమ పనిని తాము చేయడం, అవినీతిని నిర్మూలించడం, పారదర్శకత, నిజాయితీని వారు ఆశిస్తున్నారు. ఆర్థిక సంస్కరణలు అమలు అయిన తర్వాత ఎన్నో సంవత్సరాలకు వారు జన్మించారు. వివిధ ప్రపంచ దేశాల పరిస్థితుల గురించి తెలిసినవారు. ఎంతసేపూ మత రాజకీయాలు, కాంగ్రెస్ పాలనలో అమలు అయిన దుర్మార్గాల గురించి మాట్లాడడం వారికి నచ్చకపోవచ్చు. నెహ్రూ, ఇందిరలు కాదు కదా, రాజీవ్‌గాంధీని సైతం వారు చూడలేదు. నరేంద్ర మోదీ మాత్రమే వారికి సుపరిచిత దేశ పాలకుడు, జాతీయ నాయకుడు. అందువల్ల వారి భవిష్యత్తును మెరుగుపరిచేందుకు ఏమి చేయాలన్నదే ప్రస్తుత పాలకుల కర్తవ్యం. కొత్త తరం యువతను ఆకర్షించేందుకు రాజీవ్‌గాంధీ 1988లో 18 ఏళ్ల వయస్సు వారికి ఓటు హక్కు కల్పించారు. 40 ఏళ్ల వయస్సులోనే ప్రధాని అయిన రాజీవ్ తనను తాను నవయువకుడుగా భావించుకున్నప్పటికీ 1989 ఎన్నికల్లో నాటి యువతరం ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించింది. బోఫోర్స్ కుంభకోణం, పెచ్చరిల్లిన ద్రవ్యోల్బణం, పెరిగిన నిరుద్యోగం, పత్రికా స్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నాలు. షాబానో కేసు ద్వారా ప్రజలను మతపరంగా విడదీసేందుకు అనుసరించిన విధానాలే అందుకు కారణాలు. రాజీవ్ గాంధీ విఫలమైన చోట మోదీ విజయం సాధించాలంటే యువతరం మనసును ఆకట్టుకోవాలి. అందుకు మారుతున్న దేశ కాలమాన పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఎంతసేపూ కాంగ్రెసను విమర్శిస్తూ ఆ పార్టీ దుర్లక్షణాలన్నీ అలవరుచుకుని, ఆ కాలంలో జరిగిన పాపాలన్నిటినీ రెట్టింపు తీవ్రతతో పునరావృతం చేస్తుంటే జనం ప్రశ్నించకుండా ఉంటారా?



# ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తాం: సిపిఎం




**ఆత్మకూరు సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

కామ్రేడ్ టి రామకృష్ణ ఆత్మకూరు డివిజన్ లో సిపిఎం పార్టీ ఉద్యమాన్ని నిర్మించిన గొప్ప నాయకుడని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పి.సుధాకర్, నాయకులు వీరన్న లు అన్నారు.బుధవారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ తెప్పలి రామకృష్ణ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పార్టీ పట్టణ నాయకులు రామ్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు రైతులు విద్యార్థి యువజనుల సమస్యల పైన పోరాటాలు చేశారు. ఆత్మకూరు, కొత్తపల్లి పాములపాడు మండలాల్లో మెట్ట భూములకు సాగునీరు అందించాలని ఎత్తిపోతల పథకాల సాధన కొరకు అనేక ఉద్యమాలు నిర్వహించి ఆ ఉద్యమాలకు నాయకునిగా వ్యవహరించి డివిజన్ వ్యాప్తంగా మెట్ట భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ఆయనది అన్నారు. అప్పట్లో ఆత్మకూరులో జరుగుతున్న వరుస దొంగతనాలకు వ్యతిరేకంగా యువజన సంఘం నాయకత్వంలో వేలాది మందితో ర్యాలీలు నిర్వహించి దొంగతనాల అరికట్టడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలను సాధించడంలోనూ, పాలక ప్రభుత్వాల ద్వారా అందించే సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో కీలక భూమిక పోషించా రన్నారు. కావున నేటి తరం వారు ఆయన ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు నడుము బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు జి.నాగేశ్వరావు, కిరణ్, దినేష్, పాల శివుడు, సామెలు, ఎసన్న, మున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలి

-టెండర్ విధానం రద్దు చేయాలి

-వెంటనే పిఎఫ్ అమలు చేయాలి

-స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

-గ్రామీణ ప్రాంత కార్మికులకు ,పదివేల రూపాయల వేతనం అమలు చేయాలి.

-జిల్లా సిఐటియు అధ్యక్షుడు ఏ. యేసు రత్నం డిమాండ్



**నంద్యాల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

గ్రామపంచాయతీ కార్మికులు ఎంఎంఆర్ మరియు గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం అమలు చేయాలని, టెండర్ విధానం వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసు రత్నం, సిఐటియు జిల్లా కార్యదర్శి డి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులు తెల్లవారుజామున నుండి ఉరుకుల పరుగులతో పని చేస్తున్నారు . మానవ మలినాలు జంతు కళేబరాలు తొలగించడమే కాక మంచినీరు కరెంటు పనులు వసూలు తదితర విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులు పంచాయతీ కార్మికులకు మూడు నుంచి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు స్వచ్ఛభారత్ కార్మికులకు 11 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి ఎంత మంది అధికారులకు మెమొరండము ఇచ్చిన సమస్య పరిష్కారం కావడం లేదు పెండింగ్ జీతాలు ఇవ్వమంటే బెదిరింపులు తొలగింపులు చేస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డోన్ మండలము చిన్నమల్కాపురం గ్రామపంచాయతీ కార్మికులకు 11 నెలలుగా వేతనాలు లేవు డిపిఓ కు తెలియజేసిన పరిష్కారం చేయడం లేదు చాగలమర్రి గ్రామపంచాయతీలో 25 సంవత్సరాలుగా పనిచేసిన వాటర్ సిబ్బందిని అధికార పార్టీ అండదండలతో నిర్దాక్షిణ్యంగా తొలగించారు పెండింగ్ వేతనాలు ఇవ్వమన్నా ఇచ్చే పరిస్థితి లేదు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న రాష్ట్రంలో పాలకులు మారుతున్న గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల శ్రమను గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు. గ్రామపంచాయతీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గారు ఊరువాడా చాటింపు చేస్తున్నారు ఆయన పంచాయతీరాజ్ శాఖ పదవి బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయి నప్పటికీ ఇప్పటివరకు పంచాయతీ కార్మికుల సమస్యల పైన స్పందించలేదు నెలలు తరబడి తన శాఖలో కార్మికులు జీతాల కోసం ఎదురుచూస్తున్న పట్టించుకునేటువంటి పరిస్థితి లేదు . టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పులు కార్మికులు పోరాడి సాధించుకున్న జీవోలు బుట్ట దాఖలు అవుతున్న మంత్రిగారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి టెండలకు సంబంధించి హైకోర్టు తీర్పులు వెంటనే అమలు చేయాలి ప్రభుత్వం జారీ చేసిన 132,142 జీవోలను పక్కాగా అమలు చేయాలి కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఈపీఎఫ్ ఈఎస్ఐ గ్రాచ్యూటీ పెన్షన్ ప్రభుత్వ సెలవులు అమలు చేయాలి దాన సంస్కారాలకు 20,000 చెల్లించాలి సాధారణ మృతికి ఐదు లక్షలుప్రమాద మృతికి పది లక్షలు చెల్లించాలి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇతర సమస్యల పరిష్కారం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ కార్మికులు ఎన్ఎంఆర్ గ్రీన్ అంబాసిడర్ లకు కనీస వేతనాలు వెంటనే చెల్లించాలి. చిన్న మల్కాపురం గ్రామపంచాయతీలో 11 నెలల పెండింగ్లో వేతనాన్ని వెంటనే ఇవ్వాలి. స్వచ్ఛభారత్ కార్మికులకు దాదాపుగా 15 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయి వెంటనే చెల్లించాలి, స్వచ్ఛభారత్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలి. గ్రామపంచాయతీలలో టెండర్ విధానాన్ని రద్దుచేసి నేరుగా గ్రామపం చాయతీలే వేతనాలు ఇవ్వాలి. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఈపీఎఫ్ ఈఎస్ఐ గ్రాచుటి పెన్షన్ సెలవులు అమలు చేయాలి. పై సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని నంద్యాల డిపిఓ లలితా బాయి కి మెమోరాండం ఇవ్వడం జరిగింది

# ఆత్మకూరులో ఘనంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలు







-శ్రీశైలం నియోజకవర్గం లో అంగరంగ వైభవంగా జననేత సంబరాలు

-రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు

**ఆత్మకూరు సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శ్రీశైలం నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల జనసైనికులు, వీర మహిళల ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు పట్టణ ంలోని కొండ గార్డెన్స్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసైనికులు, వీర మహిళలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముందుగా పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు మీద ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం చక్రం హోటల్ నుంచి గౌడ్ సెంటర్, నంద్యాల టర్నింగ్ మీదుగా కొండ గార్డెన్స్ వరకు జనసైనికులతో కలిసి భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కొండ గార్డెన్స్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.ఈ సందర్భంగా అత్యధికసార్లు రక్తదానం చేసిన శ్యామ్ 65 సార్లు, కరివెన జనసేన నాయకులు నాగరాజు 54 సార్లు రక్తదానం చేసినందుకు వారిని ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి కర్నాటి శ్రీరాములు,అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. జనసేన పార్టీలో యువత కష్టపడి పనిచేయాలని, కష్టపడిన ప్రతి ఒక్కరికీ పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త రౌతు అశోక్ కుమార్, మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. అతి త్వరలో ఆత్మకూరు పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తానని జనసైనికులకు తెలిపారు.అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున బలమైన అభ్యర్థులను నిలబెట్టి వారిని గెలిపించుకునే బాధ్యత ప్రతి జనసైనికుడిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల నాయకులు శాలు భాష, వలి, రాజేష్, హేమలత, సుకన్య, ప్రవళికతో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు. బండి ఆత్మకూరు మండలం నుంచి జనసేన నాయకులు సురేంద్ర, మల్లీశ్వరయ్య, వేణు ఆచారి మహానంది మండలం నుంచి మండల నాయకులు మారెడ్డి రామయ్య, మల్లికార్జున, మిద్దె శివ, కొల్లి దీప. శ్రీశైలం మండలం నుంచి మండల నాయకులు దేవరాజు,ఆత్మకూరు పట్టణం నుంచి జనసేన సీనియర్ నాయకులు శేషు, పురం హరీశ్, మండల నాయకులు అరుణ్, గుంజ నాగరాజు, సురేంద్ర, దుర్గరాజు, శ్యామ్, మహేష్, హబిబుల్లా, ఖాజా హుస్సేన్, అమాన్, మహబూబ్, నాగరాజు, లావణ్యతో పాటు పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన ప్రజల సంక్షేమంలో ముందడుగు

-జి.హరి ప్రసాద్ యాదవ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి



**పాములపాడు,సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

పాములపాడు, మండల పరిధిలోని మిట్ట కందాల గ్రామంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని కార్యక ర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ,మాజీ సర్పంచ్,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును, ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 205వ బూత్ ఇన్చార్జి లింగాల శివరాముడు, తెలుగుదేశం నాయకులు నియాజ్, వి.మధు, లింగాల దేవరాజ్, సుబ్బారాయుడు, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రఘురామతో హిందూ నేతల భేటీ



**బాపట్ల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

హిందూ ధర్మ పరిరక్షణ నాయకులు, హిందూ బంధువులు బుధవారం భీమవరంలోని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.అనంతరం ఆకివీడు రామాలయాన్ని సందర్శి ంచిన వారు సుప్రీంకోర్టులో ఆలయానికి అనుకూలంగా తీర్పు రావడంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయానికి సంబంధించిన కేసులో విజయం సాధించడం పట్ల హిందూ ధర్మ పరిరక్షకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు అక్కల రామిరెడ్డి, టీడీపీ కొత్తపాలెం బూత్ అధ్యక్షుడు మారుబోయిన వెంకటేశ్వరరెడ్డి (నాని), టీడీపీ సీనియర్ నాయకుడు పిట్టల మణికంఠరెడ్డితో పాటు పలువురు హిందూ ధర్మ పరిరక్షణ నాయకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పై చైతన్యం



**కర్లపాలెం సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం**

కర్లపాలెం--బాపట్ల జాతీయ రహదారి పక్కన స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అద్దూరి శ్రీనివా సరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. చెత్తను సక్రమంగా వేరు చేసి అందించడం ద్వారా స్వచ్ఛ గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అయినంపూడి శ్రీనివాస రావు, కర్లపాలెం పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొ న్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఓటీపీ చెబితే మోసమే!

**-విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎస్పీ కీలక సూచనలు...**

బాపట్ల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం



బాపట్ల జిల్లాలో స్కాలర్‌షిప్‌ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. స్కాలర్‌షిప్ మంజూరైందంటూ ఫోన్ చేసి ఆధార్, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, పిన్, పాస్‌వర్డ్, ఓటీపీ వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. స్కాలర్‌షిప్ దరఖాస్తు, ధ్రువీకరణ పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, అపరిచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, రిజిస్ట్రేషన్ లేదా ప్రాసెసింగ్ ఫీజు పేరుతో నగదు పంపడం చేయరా దన్నారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత విద్యాసంస్థ లేదా అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా నిర్ధారించు కోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి, సంబంధిత బ్యాంకును వెంటనే సంప్రదిం చాలన్నారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే నగదు బదిలీలను అడ్డుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అప్రమత్తతతోనే సైబర్ మోసాలను నివారించవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు.

# తెలుగు ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్



బాపట్ల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా బాపట్లలో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విగ్రహానికి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం బాపట్ల ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ.. వైఎస్సార్ పేదల పట్ల అపారమైన ప్రేమాభిమానాలతో పనిచేసిన ప్రజా నాయకుడని అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పు రావాలనే తపనతో ఆయన అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థుల ఉన్నత విద్యకు బాటలు వేశారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. పేదవాడి ఇంటి సమస్యను తన సమస్యగా భావించి, ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టాలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిరంతరం పరితపించిన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ప్రజల అభిమానం, ఆదరణను సంపాదించుకున్న ఆయన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ చూపిన మార్గంలో నడవడమే ఆయనకు ఘనమైన నివాళి అని కోన రఘుపతి పేర్కొన్నారు.

# వైఎస్సార్ సేవల స్మరణ

రెంటచింతల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం



రెంటచింతల మండల కేంద్రమైన రెంటచింతలతో పాటు నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జెండా చెట్టు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేసిన ప్రజానాయకుడని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. అలాగే 2008లో 'రాజీవ్ పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా రెంటచింతల పర్యటన సందర్భంగా గ్యాస్ సబ్సిడీ హామీతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, ఎంపీపీ చాదేశ్వరి, ఉప ఎంపీపీ శౌరిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ధార్మిక చైతన్య దీపనంతో సమాజంలో ధర్మజ్యోతి వెలగాలి









**-పూజ్య ధర్మాచార్యుల పిలుపు**
**-ఘనంగా హిందూ ధార్మిక సమ్మేళనం**
**-అత్యంత భక్తిశ్రద్ధలతో చండీ హోమం**

నంద్యాల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం, సనాతన ధర్మ విలువలను ప్రజల్లో పెంపొందించాలనే సంకల్పంతో డోన్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు "ధార్మిక చైతన్య దీపనం" పేరుతో హిందూ ధార్మిక సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహి ంచారు. ముందుగా వారణాశి పట్టణానికి చెందిన సుప్రసిద్ధ పండితులు, యాజ్ఞికులు డాక్టర్ సోమయా జులు నేతృత్వంలో శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధి నందు నూతనంగా నిర్మించిన యాగశాల ప్రారం భోత్సవం, మహా చండీయాగం నిర్వహించారు. రఘు నాధ శాస్త్రి ఆలయ అర్చకులు శ్రీమాన్ పెరంబోదూర్ శ్రీకాంత్ స్వామి అత్యంత వైభవంగా యాగశాల చతుర్ ద్వార పూజ మరియు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం ధార్మిక చైతన్య దీపనం పేరుతో ధార్మిక సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అఖిలాంధ్ర సాధు పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ ఆచార్య పరమాత్మ నందగిరి స్వామీజీ ఆశీః ప్రసంగంతో ప్రారంభమైనది. తోట్లపల్లి అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విరజానందస్వామీజీ కీలకోపన్యాసం చేశారు. హైందవ సంస్కృతి నవ్య జీవనక్రాంతి అని, హైందవ సంస్కృతిని సంరక్షించుకున్నప్పుడే దేశమనుగడ సాధ్య మవుతుందని, సంస్కృతిని మరిచిపోతే దేశ సంరక్షణ ప్రశ్నార్ధకమవుతుందని హెచ్చరించారు. వారణాసి వాస్తవ్యులు డాక్టర్ సోమయాజులు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకై చేయవలసిన కృషిని గుర్తు చేస్తూ, కులభేదాలను విస్మరించి భారతీయులంతా ఒక్కటిగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మానికి గ్లాని ఏర్పడుతున్న ప్రస్తుత తరుణంలో గీతలో కృష్ణ పరమాత్మ బోధించిన విధంగా కర్తవ్య దీక్షను పూనవలసిన సమయం ఆసన్నమైందని గుర్తు చేశారు. రాష్ట్ర యువ విభాగ సాధుసంత అధ్యక్షులు శ్రీమాన్ నిత్యతృప్త దాస్ స్వామీజీ దేశంలో జరిగుతున్న పరిణామాలు తెలుసు కొని యువత జాగరూకతతో ప్రవర్తిం చవలెనని పిలుపునిచ్చారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీ రఘునందన్ సేవక్ దాస్ జీ మాట్లాడుతూ గురువు, సాధువు, శాస్త్రం ఈ మూడింటి ప్రాశస్త్యాన్ని విశ్లేషిం చారు. కలియుగంలో భవసాగరాన్ని దాటించే తారక మంత్రం భగవన్నామమేనని, దాన్ని బలంగా పట్టుకో వాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్తు రాష్ట్ర కార్యాధ్యక్షులు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సమాజ వ్యవస్థను పటిష్ఠపరచడంలో స్త్రీశక్తి చాలా కీలకమైనదని, ధర్మరక్షణకు ప్రతి స్త్రీ మూర్తి కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజుగుప్తా, శ్రీ బాల ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మె పల్లి శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థా నములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ ముక్కా అశ్వినికీర్తి స్త్రీశక్తి జాగరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డోన్ నగరంలోని అన్ని ధార్మిక సంస్థలతోపాటు, నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ధార్మిక సంస్థల ప్రతినిధులు విశేష సంఖ్యలో హాజరై, పూర్ణాహుతిని కళ్లారా దర్శించుకొని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్ర మానికి హాజరైన అతిథులకు సాధుసం తులందరినీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పాతాళం సుబ్బారావు రజినీ, శ్రీనివాసులు దంపతులు, అందరినీ ఘనంగా సన్మా నించి సత్కరించారు. పాతాళం సుబ్బారావు చేస్తున్న ధార్మిక సేవలను వక్తలు వేనోళ్ల కొనియా డారు. ఈ ధార్మిక సమ్మేళన కార్యక్రమానికి సమన్వ యకర్తగా ప్రముఖ ధార్మిక ప్రవచకులు, కవయిత్రి, తెలుగు పండితులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని వ్యవహ రించారు.

# ఏపీ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి






**-ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమిస్తాం - పిఆర్టియు**
**-నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష**

నంద్యాల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని పి ఆర్ టి యు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష, బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ ౢా=జ గడువు ముగిసి ఇప్పటికే మూడు సంవత్సరాలు పూర్తయినా, 12వ PRC కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. గతంలో నియమించిన పి ఆర్ సి కమిషన్ చైర్మన్ కేవలం ఏడు నెలలకే ఎటువంటి నివేదిక సమర్పించకుండా రాజీనామా చేసి, దాదాపు రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం, చైర్మన్ ను నియమించకపోవడం ప్రభుత్వ నిబద్ధతపై అనేక సందేహాలకు తావిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంయ మనంతో వ్యవహ రిస్తూ రెండేళ్లకు పైగా ఓపికతో వేచి చూశా యని తెలిపారు. అయితే, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు మండలంలో పి ఆర్ టి యు, సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. ప్రదీప్ కుమార్, జి. హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా వివిధ పాఠశాల లను సందర్శించి ఉపా ధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదును చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర నాయకులు పి. నూర్ మొహమ్మద్, హుస్సేన్ సాహెబ్, డి. రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహేశ్వర రావు, ఖాజా, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల్లో చెరగనిదివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు ఘన నివాళులు





**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గృహంలో 17వ వర్ధంతి, వేడుకలు**
**-ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించిన వైఎస్సార్ ఆదర్శప్రాయుడు**

నంద్యాల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గృహంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సా ర్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వైఎస్సార్‌కు నివాళు లు అర్పించారు. అలాగే నంద్యాల పట్టణం లోని శ్రీనివాస సెంటర్ సాయిబాబా నగర్, చామ కాల్వ సెంటర్లలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూల మాలవేసి నివాళులర్పించారు. ముందుగా ఈ కార్యక్ర మానికి నంద్యాల అసెంబ్లీ అబ్జర్వర్ సద్దల సూర్యనా రాయణ రెడ్డి, రాష్ట్ర సంయుక్త ప్రచార కార్యదర్శి బుల్లెద్దుల రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మాజీ బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైసీపీ జిల్లా డాక్టర్స్ వింగ్ డా. సుబ్బారెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా వైసీపీ లీగల్సేల్ అధ్యక్షుడు రామసు బ్బయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, , జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.వి రమణ, వైసీపీ రాష్ట్ర ర్ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, వైసిపి రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శి ఆంజనేయులు, వైసీపీ మం డల అధ్యక్షులు బసవేశ్వర రెడ్డి,వైసీపీ జిల్లా సెక్రటరీ దేవానగర్ బాషా,మరియు మాజీ కౌన్సలర్స్, వార్డు ఇంచార్జ్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు హాజర య్యారు ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పి.పి. నాగిరెడ్డి మాట్లాడుతూ.డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వర్ణనా తీతమని కొనియాడారు. జలయజ్ఞం ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టులను నిర్మించి వైఎస్సార్ 'జలయజ్ఞ ప్రదాత' గా నిలిచా రన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ వంటి విప్లవాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంద ని, దీనిపై పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని పి పి నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి బాటలోనే నడుస్తూ రాష్ట్రంలో మెరుగైన సంక్షేమ, అభివృద్ధి పాలన అంది ంచారని పేర్కొ న్నారు. మహానేత వైఎస్సార్ ఆశయ సాధనకు, ఆయన చూపిన బాటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలుప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# అన్నార్థుల ఆకలి బాధలు తీర్చే-అక్షయ పాత్రలు అన్న క్యాంటిన్లు





ఆత్మకూరు సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

ప్రస్తుతం "ఎల్ నినో ప్రభావం వల్ల" వట్టి కరువు (దుర్భిక్షం) తాండవిస్తున్న ఈ తరుణంలో.. పట్టెడన్నం కొరకు కడుపు చేతబట్టి, పరాయి ప్రాంతాలకు రైతులే కూలీలుగా మారి వలసలు వెళ్ళే ఈ తరుణంలో.. "ఆంధ్ర రాష్ట్రంలో అన్నార్తుల ఆకలి బాధలు తీర్చే అక్షయ పాత్రలుగా వెలుగొందుతున్నవి అన్న క్యాంటిన్లు నామమాత్రపు రుసుము వసూలు చేస్తూ. 5.రూపాలు తీసుకొని స్వచ్ఛమైన, రుచికరమైన, శుభ్రమైన. ఆహారం నిరుపేదలకు అందిస్తూ ఉదయం 7.00 గంటలకే ఫలహారాన్ని మరియు మధ్యాహ్నం , 12.00 గంటలకు మరియు రాత్రి 7.00 గంటలకు పుష్టికరమైన భోజనాన్ని సకాలంలో అందిస్తున్నవి ఈ అక్షయ పాత్రలైన అన్న క్యాంటిన్లు.. వీరి సేవలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడుతుంది

# కూటమి ప్రభుత్వ హామీల అమలు- గ్రామాల అభివృద్ధిలో ముందడుగు





**-నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, డైరెక్టర్ జి.నాగముని**

కర్నూలు సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పూల బాటలు వేస్తోందని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు,పాణ్యం ఎమ్మెల్యే గౌరు.చరితారెడ్డి, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగముని లు అన్నారు. ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఇంటింటి అభివృద్ధి -కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిం చేందుకు ఓర్వకల్లు మండలంలోని, బైరాపురం, గ్రామంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు.చరిత రెడ్డి, నియోజకవర్గం అబ్జర్వర్ లక్ష్మి ప్రసాద్, మండల కన్వీనర్ బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని లు నాయకులతో కలిసి బుధవారం ప్రచారం నిర్వహించారు.బైరాపురం గ్రామం చేరుకున్న ఎమ్మెల్యే గౌరు.చరితారెడ్డి కి రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జి.నాగముని, టీడీపీ నాయకులు, కార్య కర్తలతో కలిసి పుష్పగుచ్ఛం చేతికి అందించి, ఘన స్వాగతం పలకడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని, తదితర నాయకులు మాట్లా డుతూ చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతో ందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లు, టిడిపి నాయకులు సుధాకర్, ఆదినారాయణ రెడ్డి, బొగ్గుల రవికుమార్, దానమయ్య, గొల్ల కృష్ణ, వెంకటాద్రి, ఖాజామీయ, విజయుడు, రామాంజ నేయులు, సర్కార్, మహిళా నాయకులు,ఓర్వకల్ మండలంలోని, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనడం జరిగింది.

# న్యాయవాదుల రక్షణ చట్టం కోరుతూ ధర్నా

బాపట్ల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

న్యాయవాదుల వృత్తి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, వృత్తిపరమైన భద్రతకు ముప్పుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా లిఅడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ (న్యాయవాదుల రక్షణ చట్టం)లిను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల న్యాయవాదులు రెండు రోజుల పాటు ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా బుధ, గురువారాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు సముదాయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు.జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు తమ విధులను స్వేచ్ఛగా, భయరహితంగా నిర్వహించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అత్యవసరమని వారు పేర్కొన్నారు.



న్యాయవాదులు వృత్తి నిర్వహణలో ఎదుర్కొంటున్న బెదిరింపులు, దాడులు, ఇతర సమస్యల నుంచి రక్షణ కల్పించేందుకు సమగ్ర చట్టపంమైన భద్రత అవసరమని ఆందోళన కారులు తెలిపారు. న్యాయవాదుల పై దాడులు జరిగిన సందర్భాల్లో తగిన రక్షణ, న్యాయపరమైన చర్యలకు స్పష్టమైన వ్యవస్థ ఉండేలా ప్రభుత్వం తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కంచర్ల అవినేష్, జాయింట్ సెక్రటరీ టి. రామకృష్ణ, ట్రెజరర్ నాగమోహిని, లైబ్రరీ సెక్రటరీ కారుమూరి సురేం ద్రనాథ్‌తో పాటు న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, శ్యామలాదేవి తదితరులు పాల్గొని ఉద్యమానికి సంఘీ భావం తెలిపారు.న్యాయవాదుల వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని, రక్షణ చట్టాన్ని ఆలస్యం చేయకుండా తీసుకురావాలని వారు కోరారు.

# పేదల వైద్యానికి ఆర్థిక సాయం

వేమూరుసెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం



అమృతలూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.6,21,624 ఆర్థిక సహాయం మంజూ రైంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చుల బిల్లులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు రిఫరెన్స్ లేఖల ద్వారా CMRF కార్యాలయానికి పంపగా, అధికారులు పరిశీలించి అర్హులకు రీయింబ ర్స్‌మెంట్ మంజూరు చేశారు.మోపర్రు, వామనగుంటపాలెం, ఇంటూరు, ప్యాపర్రు, తురుమెళ్ల, పెదపూడి, పాంచాళవారం, అమృతలూరు గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు ఈ మొత్తం అందింది. ఇందులో అత్యధికంగా మోపర్రు గ్రామానికి చెందిన కొడాలి అమూల్య శ్రీకి రూ.2,01,746, తురుమెళ్లకు చెందిన మొవ్వ వెంకటసుబ్బారావుకు రూ.1,09,660 మంజూరయ్యాయి. రూ. 6,21,624 విలువైన జవీ=ఖీ రీయింబర్స్‌మెంట్ చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు జవీ=ఖీ వైద్య ఖర్చుల విషయంలో భరోసా కల్పిస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# వైఎస్సార్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గం

**-వైయస్సార్ కు ఘన నివాళులు అర్పించిన గంట అంజిబాబు..**

బాపట్ల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం



పేద, బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించి, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి గంటా అంజిబాబు అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంటా అంజిబాబు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక నూతన పథకాలు, సంస్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన ప్రజా నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆకాంక్షించిన విధంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న లక్ష్యంతో పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని అంజిబాబు తెలిపారు. వైఎస్సార్ అకాల మరణం పేద ప్రజలకు తీరని లోటుగా మిగిలిందన్నారు. ఆయన మరణంతో పేదల గుండెచప్పుడు మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పేదల పక్షాన నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# పచ్చదనంతో అభివృద్ధికి బాటలు

**-పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యం**

**-పాఠశాల అభివృద్ధికి భారీగా నిధులు**

**-చిలకలూరిపేట గ్రీనరీకి ప్రత్యేక ప్రాధాన్యం**




చిలకలూరిపేట సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం

పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణతోపాటు విద్యా సంస్థల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చేపట్టిన కార్యక్రమాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. చిలకలూరిపేట పర్యటనలో ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. చిలకలూరిపేట లో పర్యావరణ పరిరక్షణలో ప్రజలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. ఖాళీ ప్రదేశాలను గుర్తించి పెద్దఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేటలోని ఆర్వీఎస్సీవీఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో నాగబాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి పాల్గొన్నారు. నాగబాబు స్వయంగా వేప మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో సుమారు 50 మొక్కలను నాటారు.క్యాబినెట్ హోదాలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తన తొలి కార్యక్రమాన్ని చిలకలూరిపేటలో ప్రారంభించడం విశేషమని నాగబాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణకు కమిటీ ద్వారా సమగ్రంగా కృషి చేస్తానన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు.

**-రూ.3.40 కోట్లతో పాఠశాల అభివృద్ధి**

చిలకలూరిపేట నడిబొడ్డున ఉన్న ఆర్వీఎస్సీవీఎస్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. కృష్ణతేజ సహకారంతో యూనియన్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.3 కోట్లతోపాటు, ఎస్ఏపీ ద్వారా రూ.40 లక్షలు కలిపి మొత్తం రూ.3.40 కోట్లను గ్రౌండ్, వాకింగ్ ట్రాక్, క్రీడా మైదానం తదితర అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాలలో నూతన భవనాల నిర్మాణానికి అదనంగా రూ.2 కోట్ల నిధులు సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణంతోపాటు క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

**-గ్రీనరీ అభివృద్ధికి రూ.3 కోట్లు**

చిలకలూరిపేట పట్టణంలో పచ్చదనం, గ్రీనరీ అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లతో కృషి చేస్తామని నాగబాబు ప్రకటించారు. పట్టణంలోని ఖాళీ ప్రదేశాలను గుర్తించి వాటిని హరిత ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని కోరారు.

**-పవన్‌కు పుల్లారావు శుభాకాంక్షలు**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా నాయకుడిగా పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం 'పచ్చదనం--పరిశుభ్రత'కు పెద్దపీట వేస్తోందన్నారు.పర్యావరణ పరిరక్షణ, పట్టణ గ్రీనరీ అభివృద్ధి, పాఠశాల మౌలిక వసతుల బలోపేతానికి ఒకేసారి ప్రాధాన్యం ఇస్తూ నాగబాబు చేపట్టిన చర్యలు చిలకలూరిపేట అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

# ర్యాలీ.. రక్తదానంతో పవన్ బర్త్డే వేడుకలు

గురజాల సెప్టెంబర్ 2 వార్త సాక్ష్యం



జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను గురజాలలో ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు ఆధ్వర్యంలో గురజాల పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు.స్థానిక చల్లగుండ్ల గాడేస్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన పురవీధుల మీదుగా కొనసాగింది. జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ జెండాలతో సందడి చేశారు.అనంతరం శ్రీనివాస కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 70 మంది అభిమానులు రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి సహాయం అందించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ పరిధిలోని జనసేన మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 03 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం.. పీఎఫ్ ట్రస్టుల కోసం వన్ టైమ్ అమ్నెస్టీ స్కీమ్




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పరిధిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ట్రస్టులకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ భారీ ఊరట కల్పించింది. ఆదాయపు పన్ను చట్టం కింద గుర్తింపు పొంది, ఈపీఎఫ్ చట్టం ప్రకారం అధికారిక మినహాయింపు ఉత్తర్వులు లేని పీఎఫ్ ట్రస్టుల కోసం వన్ టైమ్ పరిష్కార పథకాన్ని (అమ్నెస్టీ స్కీమ్) ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ట్రస్టులు తమ మినహాయింపు హోదాను క్రమబద్ధీకరించుకునేందుకు డిసెంబర్ 28వ తేదీ వరకు గడువు విధించింది. ఈ మేరకు 2026 జూన్ 29న కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఆదాయపు పన్ను చట్టం-1961 కింద గుర్తింపు ఉండి, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్స్ అండ్ మిసిలేనియస్ ప్రొవిజన్స్ (ఈపీఎఫ్ఎంపీ) యాక్ట్- 1952లోని సెక్షన్ 17 లేదా కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ (సీఓఎస్ఎస్), 2020లోని సెక్షన్ 143 కింద అధికారిక మినహాయింపు లేని పీఎఫ్ ట్రస్టులకు ఈ అమ్నెస్టీ పథకం వర్తిస్తుంది. ఇది ఒక పరివర్తన చర్యగా, ఆరు నెలల పాటు అందుబాటులో ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి కార్యాచరణ మార్గదర్శకాలతో ఈపీఎఫ్ఓ 2026 జులై 11న ఒక సర్క్యులర్ జారీ చేసింది.

## ఉబర్‌లో భారీ లేఆఫ్‌లు.. 3,300 మంది ఉద్యోగుల తొలగింపు




ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు.సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరి చేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పని సరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహిoచాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

## భారత్‌లో భారీగా ఉద్యోగాలు ఇవ్వనున్న 5 రంగాలు ఇవే.. వరల్డ్ బ్యాంక్ చీఫ్ కీలక వ్యాఖ్యలు




భారత్‌లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉన్న ఐదు కీలక రంగాలను వరల్డ్ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా గుర్తించారు. మౌలిక వసతులు, వ్యవసాయం, ప్రాథమిక ఆరోగ్య సేవలు, పర్యాటకం, విలువ ఆధారిత తయారీ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడొచ్చని చెప్పారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) ఉద్యోగాల కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బంగా మాట్లాడుతూ.. భారత్ ఆర్థిక వృద్ధిని యువ జనాభాకు ఉద్యోగాలుగా మార్చాలంటే ప్రైవేట్ పెట్టుబడులు చాలా కీలకమని చెప్పారు. ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తే.. ప్రైవేట్ రంగం ఉద్యోగాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు రావచ్చని అన్నారు. బంగా జాబితాలో మౌలిక వసతులు మొదటి స్థానంలో ఉన్నాయి. రహదారులు, నిర్మాణ రంగంలో నేరుగా ఉపాధి లభించడంతో పాటు మెరుగైన కనెక్టివిటీ వల్ల ఇతర ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయని చెప్పారు. రెండోది చిన్న రైతుల ఆధారిత వ్యవసాయ రంగం. ఉత్తర్‌ప్రదేశ్‌లో టెక్నాలజీ సాయంతో సహకార సంఘాలు చిన్న రైతులకు అవసరమైన విత్తనాలు, ఇతర ఇన్‌పుట్స్‌ను పెద్ద స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడాన్ని తాను చూశానని బంగా వివరించారు. ప్రాథమిక ఆరోగ్య సేవ లను స్థానిక స్థాయిలో క్లినిక్‌ల ద్వారా అందిస్తే భారీగా ఉద్యోగాలు వస్తా యని ఆయన చెప్పారు. నర్సులు, డయాగ్నోస్టిక్ టెక్నీషియన్లు, మిడ్‌వైఫ్‌లకు ఉపాధి లభిస్తు ందని, డిజిటల్ టెక్నాలజీ ద్వారా వీటిని పెద్ద ఆసుపత్రులు, వైద్యులతో అనుసం ధానించవచ్చని తెలిపారు. పర్యాటక రంగాన్ని కూడా భారీ అవకాశంగా బంగా అభివర్ణించారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్‌తో చర్చించినట్లు చెప్పారు. ఐదో రంగంగా విలువ ఆధారిత తయారీని పేర్కొన్నారు. ఖనిజాలు, లోహాలు, ఫ్యాషన్ వంటి రంగాల్లో భారత్‌కు ఉన్న సామర్థ్యాన్ని మరింత అభివృద్ధి చేస్తే ఉద్యోగాలతో పాటు ఆర్థిక విలువ కూడా పెరుగుతుందని బంగా అన్నారు.

# స్పోర్ట్స్

## రోహిత్ అనుభవం, కోహ్లి దూకుడు
## 2027 ప్రపంచకప్‌లో భారత జట్టుకు అవే బలం: జాంటీ రోడ్స్



భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణిం చడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరా టాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్- కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ



దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారం భించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసిం చాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నిం గ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు.

## పాక్ క్రికెట్‌లో కలకలం.. ఇమామ్ గాయంపై విచారణకు పీసీబీ ఆదేశం



ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్ ఇమామ్ ఉల్ హక్ గాయం వ్యవహారం ఇప్పుడు తీవ్ర వివాదంగా మారింది. మ్యాచ్ మధ్యలో కాలి కండరాలు పట్టేయడంతో అతను రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్‌కు రాలేదు. ఈ ఘటనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) విచారణకు ఆదేశించడంతో పాక్ క్రికెట్‌లో కలకలం రేగింది. లార్డ్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 194 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి తర్వాత పాక్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావేద్ ఈ విషయంపై స్పందించాడు. "కేవలం కండరాలు పట్టేసిన గాయంతో ఒక ఆటగాడు రెండు ఇన్నింగ్స్‌లలో ఎలా బ్యాటింగ్‌కు రాలేకుండా ఉంటాడు? ఈ విషయంపై కచ్చితంగా విచారణ జరుగుతుంది" అని ఓ స్థానిక టీవీ ఛానెల్‌తో అన్నాడు. "గతంలో ఆటగాళ్లు ఫ్రాక్చర్లతో కూడా జట్టు కోసం మైదానంలోకి వచ్చారు. ఇది చాలా తీవ్రమైన విషయం, విచారణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశాడు.మరోవైపు, పీసీబీ విచారణను ఎదుర్కోవడానికి ఇమామ్ న్యాయవాది సహాయం తీసుకునే అవకాశం ఉందని పీటీఐ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఈ పరిణామంతో ఇమామ్ తీవ్ర ఇబ్బందుల్లో పడినట్లు తెలుస్తోంది. సిరీస్‌లో వరుస ఓటముల నేపథ్యంలో పీసీబీ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇమామ్‌తో పాటు మరో ఆరుగురు ఆటగాళ్లను, హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను వెంటనే ఇంగ్లండ్ నుంచి వెనక్కి పిలిపించింది.

# ‘స్పిరిట్’ను దాటేయాలి- ‘రోమాంచకం’ టీమ్‌కు ప్రభాస్ ఆల్ ది బెస్ట్!





పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఒక చిన్న సినిమాకు తన మద్దతు తెలిపి ప్రమోషన్స్‌లో కొత్త జోష్ నింపారు. సందీప్ రెడ్డి వంగా సమర్పణలో వస్తున్న ‘రోమాంచకం’ చిత్ర బృందానికి ఆయన తన శుభాకాంక్షలు అందజేశారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలని, తన ‘స్పిరిట్’ చిత్రాన్ని కూడా దాటిపోవాలని సరదాగా వ్యాఖ్యానించారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ‘రోమాంచకం’ సినిమా రేపు (సెప్టెంబర్ 3న) థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా హీరో సుమంత్ ప్రభాస్, రెబల్ స్టార్ ప్రభాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రభాస్, సుమంత్ షర్ట్‌పై సంతకం చేసి.. “ఆల్ ది బెస్ట్.. ఇరగదీసేయ్. ‘రోమాంచకం’ బ్లాక్ బస్టర్ అయిపోవాలి. ‘స్పిరిట్’ని కూడా దాటెయ్యాలి” అంటూ చిత్ర బృందానికి విషెస్ చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకుంది. ప్రస్తుతం ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’ అనే భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాను టీ-సిరీస్‌తో కలిసి సందీప్ సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా తన భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇప్పుడు అదే బ్యానర్‌లో, సందీప్ వంగా సమర్పణలో ‘రోమా ంచకం’ వస్తుండటంతో ప్రభాస్ తన వంతు సపోర్ట్ అందిస్తున్నారు. గతంలో ఈ చిత్ర ట్రైలర్‌ను కూడా ఆయన సోషల్ మీడియాలో షేర్ చేసి ప్రశంసించారు. వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ ‘రోమాంచకం’ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ప్రభాస్ వంటి స్టార్ నుంచి మద్దతు లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.





## ‘జైలర్ 2’ విడుదలపై వదంతులకు చెక్.. అనుకున్న తేదీకే వస్తున్న టైగర్ ముత్తువేల్ పాండియన్

సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘జైలర్ 2’ సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ చిత్రం వాయిదా పడుతోందంటూ వస్తున్న వార్తలకు చిత్ర నిర్మాణ సంస్థ ఫుల్‌స్టాప్ పెట్టింది. ముందుగా ప్రకటించినట్లే దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసి అభిమానుల్లో జోష్ నింపింది. 2023లో విడుదలై సంచలన విజయం సాధించిన ‘జైలర్’ సినిమాకు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అయితే, సినిమా షూటింగ్ పూర్తయినా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా పూర్తి కాలేదని, దీనివల్ల సినిమా అనుకున్న సమయానికి రావడం కష్టమంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో జోరుగా చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో సన్ పిక్చర్స్ సంస్థ ఈ వదంతులను ఖండిస్తూ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది.




## సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్ మృతి కేసులో బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు

బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్ మృతి కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో నమోదైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం, దిశా సాలియాన్ అనుమానాస్పద మృతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణకు ఆదేశిస్తూ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే... జూన్ 2020లో ముంబైలోని మలాడ్ ప్రాంతంలో ఉన్న 14వ అంతస్తు భవనం నుంచి కిందపడి దిశా సాలియాన్ మృతి చెందారు. ఆమెది ఆత్మహత్య అని మొదట్లో పోలీసులు పేర్కొన్నప్పటికీ... ఆ తర్వాత తీవ్ర అనుమానాలు, రాజకీయ ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మూడేళ్లకు పైగా కేవలం యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ ప్రాతిపదికన మాత్రమే దర్యాప్తును కొనసాగించడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపి నిజాన్ని బయటకు తీసేందుకు కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్రంగా విచారించాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. గతంలో శివసేన (యుబిటి) నేత ఆదిత్య థాకరేపై దిశా తండ్రి సతీశ్ సాలియాన్ ఆరోపణలు చేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరగా... సరైన ఆధారాలు లేకుండా ఎవరినీ నిందితులుగా పేర్కొనలేమని, అయితే పారదర్శక దర్యాప్తు అత్యవసరమని కోర్టు పేర్కొంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణానికి కొన్ని రోజుల ముందే ఈ ఘటన జరగడంతో, సీబీఐ విచారణ నిర్ణయం బాలీవుడ్ తో పాటు దేశవ్యాప్తంగా మళ్లీ తీవ్ర చర్చనీయాంశమైంది.





PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.